RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 125 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 2-8-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


### నీలగిరి నిత్యపద్యం


కందము

విద్యయె వినయము నొసగును
విద్యయె జనులకు విశిష్ట విత్తము సుమ్మీ
విద్యయె సుఖములనిచ్చును
విద్యయె చేయును విదేశి బంధుగ మనలన్

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు, కవి


విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


## మరోసారి సుంకాలతో విరుచుకుపడిన ట్రంప్..

- 70కిపైగా దేశాలపై పెరిగిన టారీఫ్‌లు

వాషింగ్టన్

ప్రపంచ దేశాలపై సుంకాలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. 70కిపైగా దేశాలపై ఉన్న పరస్పర సుంకాలను 10 శాతం నుంచి 41 శాతం వరకు పెంచారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకాలు చేశారు. కెనడాపై ఇప్పటివరకు 25 శాతంగా ఉన్న టారీఫ్‌లను 35 శాతానికి పెంచారు. ఇక భారత్‌పై 25 సుంకాలు విధిస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించిన ట్రంప్.. అత్యధికంగా సిరియాపై 41 శాతం సుంకాలు విధించారు. వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో యూరోపియన్ యూనియన్‌కు సుంకాల విషయంలో కొంత వెసులుబాటు కల్పించారు. 15 శాతం కంటే ఎక్కువ సుంకాల రేట్లు ఉన్న వస్తువులకు కొత్త టారీఫ్‌ల నుంచి -మిగతా 2 లో



## సమస్యలపై పోరాటంలో కమ్యూనిస్టులది అగ్రభాగం



- అధికారంలో ఉన్నవారిని దించడంలోనూ ముందుంటారు
- వంటకంలో ఉప్పు లాంటి వారు...వారు లేకుంటే రాజకీయాలు లేవు
- దిగజారుతున్న జర్నలిజం విలువలు...సోషల్ డియా పేరుతో అరాచకాలు
- నవ తెలంగాణ దశమ వార్షికోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్ట్ 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ప్రజాసమస్యలపైపోరాటంలో కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుంటారని, వారిది రాజీలేనిపోరాటమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అధికారంలోకి తేవడానికి కమ్యూనిస్టులు ఉపయోగపడతారో లేదో విశ్లేషించలేను కానీ, అధికారంలో ఉన్నవారిని దించడానికి మాత్రం పనికొస్తారని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన నవ తెలంగాణ దశమ వార్షికోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. తప్పు చేసేవాళ్లను గద్దె -మిగతా 2 లో



## ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల

- 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ
- నామినేషన్లు దాఖలుకు ఆగస్టు 21 చివరితేదీ
- సెప్టెంబర్ 9న ఎన్నిక...అదేరోజు ఫలితం ప్రకటన

న్యూఢిల్లీ,

: జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీగా ఉన్న ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల సంఘం కసరత్తు మొదలు పెట్టింది. ఈ క్రమంలో నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం శుక్రవారం షెడ్యూల్ విడుదలైంది. సెప్టెంబర్ 9న ఆ ఎన్నిక జరగనుందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఈ పక్రియ అనివార్యమైంది. పార్లమెంటు- వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ధన్‌ఖడ్ తన పదవిని వీడారు. ఈ నేపథ్యంలో ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. -మిగతా 2 లో



## మా దగ్గర ఆటంబాంబు లాంటి ఆధారాలున్నాయి..

- ఈసీ పై విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు

న్యూఢిల్లీ,

భారత ఎన్నికల సంఘం పై లోక్‌సభ లో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. బీజేపీ కోసం ఎన్నికల సంఘం ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఆ విషయాన్ని రుజువు చేసేందుకు తమవద్ద అణుబాంబు లాంటి ఆధారాలున్నాయని చెప్పారు.బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఈసీ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టింది. దానికి సంబంధించి ఇవాళ ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసింది. అయితే ఈ సవరణను ముందు నుంచీ వ్యతిరేకిస్తున్న రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రస్థాయి నుంచి ఓట్ల చౌర్యం జరుగుతోందని తాము ఎప్పటినుంచో అనుమానిస్తున్నామన్నారు.మధ్యప్రదేశ్, మహారాష్ట్రతోపాటు లోక్‌సభ ఎన్నికల్లోనూ -మిగతా 2 లో

## తెలంగాణలో రేషన్ కార్డుల పండుగ

### ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మల ఇళ్లు

- వీటిపై బీఆర్ఎస్ నేతలో చర్చకు సిద్ధం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హైదరాబాద్,

తెలంగాణలో ఇప్పుడు రేషన్ కార్డుల పండుగ జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కొక్క నియోజకవర్గానికి 3,500 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఉచిత బస్సులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని సంతోషం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనూ 3,500 ఇళ్లు -మిగతా 2 లో




## జాతీయ ఉత్తమ చలనచిత్ర అవార్డుల ప్రకటన

- ఉత్తమ చిత్రంగా ’12 త్ ఫెయిల్’కి అవార్డు
- ఉత్తమ నటులుగా షారుక్ ఖాన్, విక్రాంత్ మస్సే
- ఉత్తమ నటిగా రాణీ ముఖర్జీ
- ఉత్తమ తెలుగు చిత్రంగా భగవంత్ కేసరి
- బలగం పాటకు ఉత్తమ గేయరచయిత అవార్డు

న్యూఢిల్లీ, ఆగస్ట్ 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

2023 సంవత్సరానికి సంబంధించిన 71వ జాతీయ చలన చిత్ర అవార్డులను కేంద్రం ప్రకటించింది. ఈ అవార్డుల జ్యూరీ కమిటీ- శుక్రవారం కేంద్ర సమాచారం, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు నివేదికను అందజేసింది. మొత్తం 15 విభాగాల్లో అవార్డులను జ్యూరీ ఈ సందర్భంగా ప్రకటించింది. ఇక జాతీయ ఉత్తమ చిత్రంగా ’12 త్ ఫెయిల్’కు అవార్డు దక్కింది. జాతీయ ఉత్తమ నటుడి అవార్డును ఇద్దరు నటులు పంచుకోవడం విశేషం. షారుక్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే (12క్లాస్ ఫెయిల్)లు ఉత్తమ నటుడి అవార్డుకు ఎంపికయ్యారు. ఉత్తమ నటిగా రాణీ ముఖర్జీ (మిస్సెస్ ఛటర్జీ మిగతా 2 లో

## రష్యాతో చమురు బేరం కొనసాగుతుంది



- భారత్ తన వాణిజ్య అవసరాల మేరకు నడుచుకుంటుంది
- ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో విదేశాంగ ప్రతినిధి స్పష్టీకరణ

న్యూఢిల్లీ,

భారత్‌పై 25 శాతం దిగుమతి సుంకాలు విధించడంతో పాటు- రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై భారత్ ఆచితూచి స్పందించింది. ఆ రెండు దేశాలు పతనమైన ఆర్థిక వ్యవస్థలంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై చెప్పడానికి -మిగతా 2 లో

### మోసం, దగా, నయవంచనకు

## మరో పేరు కాంగ్రెస్

- అటు ప్రజలను, ఇటు న్యాయస్థానాలను మోసం అంతరించి పోయాయని అనుకున్న రాబందులు కాంగ్రెస్
- నేతల రూపంలో తెలంగాణ ప్రజలను పీక్కుతింటున్నారు



హైదరాబాద్ ఆగస్ట్ 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

కాంగ్రెస్ అంటేనే మోసం, దగా, నయవంచన అన్న నిజం ఫార్మా సిటీ భూముల వ్యవహారంతో మరోసారి తెలిసిందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అధికారంలోకి వస్తే ఫార్మా సిటీని రద్దుచేసి భూములను తిరిగి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇతర అవసరాలకు వాటిని మళ్లించడం అత్యంత నీచమైన చర్య అని మండిపడ్డారు. అధికారం ఉందన్న -మిగతా 2 లో



## సీఎం రేవంత్‌కు కాళేశ్వరం నివేదిక

- అందచేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి


హైదరాబాద్ -

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కి కాళేశ్వరం కమిషన్ నివేదిక అందింది. శుక్రవారం దీనిని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై జస్టిస్ పీసీ ఘోష్ న్యాయ విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. సంబంధిత నివేదికను గురువారం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు ఆయన అందజేశారు. శుక్రవారం ఆ నివేదిక సీఎంకు చేరింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌తో డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు భేటీ- అయ్యారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై వీరంతా చర్చించారు.

-మిగతా 2 లో

## సాగునీటి జలాలపై అవగాహన తెచ్చుకోండి

- బనకచర్లపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎలా
- ఇదేమీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదని గుర్తుంచుకో
- నదీజలాల కేటాయింపులు తెలిసి మాట్లాడాలి
- కాళేశ్వరంను అడ్డుకోవడానికి చంద్రబాబు లేఖలు రాసారు
- లోకేశ్ వ్యాఖ్యలపై మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



హైదరాబాద్,- ఆగస్ట్ 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

సాగునీటి జలాల్లో నారా లోకేశ్‌కు అవగాహనం లోపం ఉందని, ఆయన యంగ్‌స్టర్.. భవిష్యత్‌ను చెడగొట్టుకుంటున్నారని, అవగాహన లేకుండా మాట్లాడి ప్రజల ముందు అభాసుపాలు కావద్దని, ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌పై బిఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదు.. పొక్కలు కొట్టేందుకు అని నారా లోకేశ్‌కు హరీశ్‌రావు వార్నింగ్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టుపై -మిగతా 2 లో

# సమస్యలపై పోరాటంలో కమ్యూనిస్టులది అగ్రభాగం

(మొదటి తరువాయి)

దించడంలో కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుంటారని అన్నారు. అబద్ధాల ప్రాతిపదికన రాజకీయాలు చేయకూడదని.. రాజకీయాల్లోకి వచ్చినప్పుడే నిర్ణయించుకున్నానని ఈ సందర్భంగా సిఎం అన్నారు. కమ్యూనిస్టులు ఉప్పు లాంటి వారు. ఎన్ని మసాలాలు ఉన్నా.. ఉప్పు లేకపోతే వంటకు రుచి రాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కమ్యూనిస్టులు చేసిన ఉద్యమాలు ఉపయోగపడ్డాయి. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందంటే.. ఆనాడు విద్యుత్ ఉద్యమాలను లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లింది కమ్యూనిస్టు సోదరులని నమ్ముతున్నానని అన్నారు.. 2023లో మేము అధికారంలోకి రావడానికి ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో వీరభద్రం చేసిన పాదయాత్రలు, పోరాటాలు కారణం కావొచ్చన్నారు. ప్రజా పాలనను కొనసాగించడానికి కూడా మీ సహకారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇదిలావుంటే సీనియర్ పాత్రికేయులు రాసిన విశ్లేషణలు మాకెంతో ఉపయోగపడతాయని తెలిపారు. వార్తా కథనాలను నిశితంగా గమనిస్తూ ఉంటానని అన్నారు. పరిపాలనపై పట్టు సాధించాలంటే విశ్లేషణలు చదవాలని, అన్ని అంశాలు ఒకే చోట క్రోడీకరించి విశ్లేషణలు రాయడం ఎంతో ఉపయోగకరమని తెలియజేశారు. అయితే జర్నలిజం విలువలు దిగజారుతున్నాయని, ఇప్పుడు ప్రతి ఒక్కరు జర్నలిస్టుగా కనిపిస్తున్నారని అన్నారు. ఇందులో ఎవరు ఏమిటో మీరే చెప్పాలన్నారు. జర్నలిజం డెఫినేషన్ మారిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జర్నలిజం వృత్తిలో ఉన్నవాళ్లు తమ బాధ్యతను మరవకూడదన్నారు. సోషల్ మీడియా పేరుతో జర్నలిజంలోకి వస్తున్నా వారి విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియా జర్నలిస్టులను వేరే చేయాలని.. వాళ్లను వేరుగా కూర్చోబెట్టాలని పాత్రికేయులకు సీఎం విజ్ఞప్తి చేశారు. వాళ్లు, మీరు ఒక్కటి కాదన్న భావనను ప్రజలకు కల్పించాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. ఈ రోజు మీడియా, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ఎవరు పడితే వాడు జర్నలిస్ట్ అని గొప్పలు చెప్పుకుంటున్నారు. పెన్ను పేపర్ ఇస్తే ఏబీసీడీలు కూడా రాయలేని వారు కూడా నేను జర్నలిస్ట్‌ని అంటారన్నారు. ఏం జర్నలిస్ట్ అని అడిగితే సోషల్ మీడియా జర్నలిస్ట్ అంటున్నారు. పేరు పక్కనే జర్నలిస్ట్ అని పెట్టుకుంటారు అదేదో వాళ్ల ఇంటిపేరు అయినట్టు- అంటూ వ్యాఖ్యానించారు. వాళ్ల తాతలు, ముత్తాతల నుంచి జర్నలిజంలోనే పుట్టి పెరిగినట్టు. జర్నలిస్ట్ ఎల్లయ్య, జర్నలిస్ట్ పుల్లయ్యా అని పెట్టుకుంటున్నారు.

# తెలంగాణలో రేషన్ కార్డుల పండుగ

(మొదటి తరువాయి)

ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే కొత్తగా 5500 రేషన్ కార్డులు ఇస్తున్నామని నొక్కిచెప్పారు. ఈ విషయంపై బీఆర్ఎస్ నేతలు చర్చకు సిద్ధమా అని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. రేషన్ కార్డుల్లో అర్హులు ఉంటే లబ్ధిదారులందరికీ అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. రేషన్ కార్డుల్లో 2,30,000 మంది నూతన పేర్లు చేర్చామని చెప్పుకొచ్చారు. రేషన్ కార్డులు రాని పేదలు దరఖాస్తు చేసుకుంటే పార్టీలకు అతీతంగా అందజేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో రోడ్లు, విద్యుత్, ఇతర సమస్యలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. 56941 రేషన్ కార్డులు ఉంటే 2లక్షల మందికి సన్నబియ్యం అందజేస్తున్నామని ప్రకటించారు. అభివృద్ధి పనుల్లో తమ ప్రభుత్వం రాజకీయం చేయదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం రేషన్ కార్డుల పంపిణీని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. స్థానిక ఫంక్షన్ హాల్లో ఏర్పాటు- చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచందన, కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, దేదీప్య, రాజ్‌కుమార్ పటేల్ తదితరులతో కలిసి లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 11 ఏళ్ల తర్వాత తొలిసారిగా ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులను అందజేసిందని ప్రకటించారు గత కేసీఆర్ ప్రభుత్వం పేదలకు ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించలేదని.. తమ ప్రభుత్వంలో రేషన్ కార్డుల కోసం ప్రజల ఎదురుచూపులకు తెరపడిందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ సభలో వెంగళరావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృతంలోని తెలంగాణ ప్రభుత్వం సుమారు 6 లక్షల పై చిలుకు కార్డులను అందజేశామని తెలిపారు. దేదీప్య మాట్లాడుతుండగా మంత్రి పొన్నం ప్రభాకర్ అడ్డు తగిలారు. అప్పుడు మీ ప్రభుత్వం చేసిన ప్రతి విషయం ప్రజలు గమనించారని అన్నారు. అనంతరం దేదీప్య మాట్లాడిన తర్వాత ఆక్వా చైర్మన్ రాఘవరెడ్డి గత కేసీఆర్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఆ సమయంలో దేదీప్య మాట్లాడేందుకు ప్రయత్నించగా చాల్లే అమ్మ కూర్చో అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. పేదలకు నిజమైన సేవ చేసే పార్టీ కాంగ్రెస్ అని ఉద్ఘాటించారు.గతంలో ఎన్నడూ లేనివిధంగా తెలంగాణలో భారీ సంఖ్యలో రేషన్ కార్డులను తమ ప్రభుత్వం అందజేస్తోందని ఆక్వా చైర్మన్ రాఘవరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం వెంగళరావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య మీడియాతో మాట్లాడారు. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాజకీయ సభగా నిర్వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తులను సభపై కూర్చోబెట్టారని మండిపడ్డారు. గత కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీ-లు ఇస్తామని గద్దెనెక్కిన రేవంత్ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందని ధ్వజమెత్తారు కార్పొరేటర్ దేదీప్య. ఉచిత కరెంటు-, గ్యాస్ పథకం సరిగా అమలు కావడం లేదని కార్పొరేటర్ దేదీప్య విమర్శించారు. ఇప్పటికైనా గత ప్రభుత్వాలను విమర్శించడం మాని ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుటుంబంలో కేసీఆర్ ఎవరికీ సీటు- కేటాయించిన బీఆర్ఎస్ శ్రేణులంతా కలిసి పనిచేస్తామని ఉద్ఘాటించారు. ఉప ఎన్నికలో సీటు- ఆశిస్తున్నారా అని మీడియా ప్రతినిధులు అడిగిన సమాధానానికి బదులుగా పార్టీ సీటు- కేటాయిస్తే బరిలో ఉండేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. అదే సమయంలో పార్టీ తరఫున ఎవరికీ సీటు- కేటాయించిన పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని దేదీప్య పేర్కొన్నారు.

# జాతీయ ఉత్తమ చలనచిత్ర అవార్డుల ప్రకటన

(మొదటి తరువాయి)

వర్సెస్ నార్వే - హిందీ) అవార్డుకు ఎంపికైంది. ఉత్తమ దర్శకుడి అవార్డు 'ది కేరళ స్టోరీ' డైరెక్టర్ సుదీప్తో సేన్‌ను వరించింది. జాతీయ అవార్డుల్లో తెలుగు సినిమా సత్తా చాటింది. ఉత్తమ తెలుగు చిత్రంగా ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి'కి అవార్డు దక్కడం విశేషం. ఉత్తమ యాక్షన్ (స్టంట్ కొరియోగ్రఫీ)లో హన్-మాన్ చిత్రం అవార్డు అందుకోగా.. ఉత్తమ గేయ రచయితగా కాసర్ల శ్యామ్ (బలగం) అవార్డు దక్కించుకున్నాడు. ఇక హన్-మాన్ చిత్రానికి యాక్షన్ డైరెక్టర్స్‌గా నందు, పృథ్వీ పని చేశారు. బలగం సినిమాలోని ఊరు పల్లెటూరు సాంగ్‌కు జాతీయ అవార్డు దక్కింది. ఇక ఉత్తమ స్క్రీన్ ప్లే అవార్డును సాయి రాజేశ్ , నీలమ్ (బేబీ తెలుగు), రామ్ కుమార్, బాలకృష్ణన్ (పార్కింగ్ - తమిళం) అందుకున్నారు. ఉత్తమ నేపథ్య గాయకుడు పీవీయన్‌యస్ రోహిత్ (బేబీ), ఉత్తమ బాలనటు-డు/నటి అవార్డును సుకృతి వేణి (సుకుమార్ కుమార్తె - గాంధీ తాత చెట్టు- - తెలుగు), కబీర్ కందరే (జిప్సీ మరాఠీ), త్రిష, శ్రీనివాస్, భార్గవ్ (నాల్ 2- మరాఠీ) అందుకోవడం విశేషం. భగవంత్ కేసరి' అవార్డు దక్కించుకుంది. ఆ చిత్రంలో హీరోగా నటించిన నందమూరి బాలకృష్ణ ఈ పురస్కారంపై స్పందించారు. భగవంత్ కేసరి' 71వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికవడం ఎంతో గర్వకారణం. ఈ గౌరవం మా చిత్ర బృందానికే చెందుతుంది. నిర్మాతలు సాహు గారపాటి, హరీశ్ పెద్ది, ఈ కథను అద్భుతంగా ఆవిష్కరించిన దర్శకుడు అనిల్ రావిపూడి, నటులు, సాంకేతిక నిపుణులు.. ఇలా అందరి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైంది. జాతీయ అవార్డుల జ్యూరీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఇతర విజేతలకు అభినందనలు. వారి ప్రతిభ భారతీయ సినీ రంగాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది. ఈ గుర్తింపు మాకు మరింత స్ఫూర్తినిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల హృదయాలను తాకే శక్తిమంతమైన కథలను అందించాలన్న మా తపనను రెట్టింపు చేస్తోందని పేర్కొన్నారు. మా సినిమా 'హను-మాన్' రెండు కేటగిరీల్లో (యానిమేషన్- వీఎఫ్ఎక్స్, యాక్షన్ కొరియోగ్రఫీ) అవార్డులు దక్కించుకోవడం ఆనందంగా ఉంది. వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్ వెంకట్‌కుమార్, స్టంట్ మాస్టర్స్ నందు, పృథ్వీలకు శుభాకాంక్షలు అంటూ దర్శకుడు ప్రశాంత్ వర్మ తెలిపారు.

## మోసం, దగా, నయవంచనకు మరో పేరు కాంగ్రెస్

(మొదటి తరువాయి)

అహంకారంతో ప్రజల అనుమతి లేకుండా భూముల సర్వే జరపాలనుకోవడం ఫాసిస్టు చర్య అన్నారు. మా భూములు మాగ్గావాలె అని మర్లవడ్డ రైతులపై అక్రమ కేసులు పెడుతున్న రేవంత్ రాక్షసత్వాన్ని అడ్డుకుంటామన్నారు.ఫార్మా రైతులను నిలువునా ముంచి అనుముల అన్నదమ్ముల కోసమే ఫ్యూచర్ సిటీని రేవంత్ రెడ్డి నిర్మిస్తున్నాడని కేటీఆర్ విమర్శించారు. అడుగడుగునా అన్నదాతలు మర్లవడుతున్నా, ఏకంగా ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బుద్ధి రావడం లేదన్నారు. చట్టప్రకారం భూములను తిరిగి పొందే హక్కు ఉన్న రైతులతో ప్రభుత్వం ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు. ఓవైపు ఫార్మా సిటీ రద్దు చేస్తున్నట్టు ప్రకటించి, మరోవైపు కొనసాగిస్తామని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన రేవంత్ ప్రభుత్వం, అటు ప్రజలను, ఇటు న్యాయస్థానాలను మోసం చేసిందన్నారు. ఫార్మా సిటీ రద్దైతే తమ భూములు తిరిగి వస్తాయని ఆశపడ్డ రైతుల నోట్లో మట్టికొడుతున్న రేవంత్ రెడ్డికి కర్రుగాల్చి వాతపెట్టేందుకు అన్నదాతలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ హెచ్చరించారు. లగచర్ల గిరిజన రైతుల భూములు, కంచె గచ్చిబౌలి అటవీ భూములు, అనుముల బ్రదర్స్ కోసం ఇప్పుడు ఫార్మాసిటీ అన్నదాతల భూములను చెరబట్టే పన్నాగాల దాకా.. రేవంత్ పాపాల పుట్ట రోజురోజుకూ పెరిగిపోతూనే ఉందన్నారు కేటీఆర్. అబద్ధపు హామీలి ఇవ్వడం, యథేచ్ఛగా చట్టాలను ఉల్లంఘించడం, ప్రశ్నించిన వారిని వేధించడం, సిగ్గులేకుండా భూ కబ్జాలు చేయడమే మూల స్తంభాలుగా రేవంత్ ప్రభుత్వ పాలన నడుస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. అంతరించి పోయాయని అనుకున్న రాబందులు కాంగ్రెస్ నేతల రూపంలో తెలంగాణ ప్రజలను పీక్కుతింటున్నాయని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

## సాగునీటి జలాలపై అవగాహన తెచ్చుకోండి

(మొదటి తరువాయి)

తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. గురువారం నారా లోకేశ్ మాట్లాడుతూ.. మిగులు జలాలు సముద్రంలో కలుస్తున్నాయి.. కనబడుతలేదా అంటున్నాడు. అధికారం ఉంది కదా.. మందబలం ఉంది.. సీఎం రేవంత్, కేంద్రం మా చేతుల్లో ఉన్నారని ఏది మాట్లాడితే అది మాట్లాడితే చెల్లుతదనుకుంటే పొరపాటని అన్నారు. మిగులు జలాలు సముంద్రంలో కలుస్తున్నాయి అంటున్నారు కదా.. ఒక వేళ నీళ్లు ఉన్నదే నిజమైతే కేంద్ర ప్రభుత్వ సంస్థలు సెంట్రల్ వాటర్ కమిషన్ మీ డీపీఆర్‌ను ఎందుకు తిప్పి పంపింది. గోదావరి రివర్ మేనేజమెంట్ బోర్డు ఎందుకు తిప్పి పంపింది. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వ శాఖ కూడా తిరస్కరించింది. నీళ్లు ఉన్నది నిజమైతే నాలుగు కేంద్ర సంస్థలు బనచర్లకు ఎందుకు తిరస్కరించాయో లోకేశ్ సమాధానం చెప్పాలి. గోదావరిలో తెలంగాణ వాటా ఎంత..? ఏపీ వాటా ఎంతో సమాధానం చెప్పాలని నారా లోకేశ్‌ను హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు పొక్క కొట్టి తీసుకుపోతున్నామా..? పొక్క కొట్టేందుకు ఇది ఏమైనా శ్రీశైలం ప్రాజెక్టా..? పోతిరెడ్డిపాడు ప్రాజెక్టా..? ఇది ఏమైనా ఉమ్మడి ఆంధ్రప్రదేశా..? కాళేశ్వరం ఒక లిఫ్ట్ ఇరిగేష్ ప్రాజెక్టు.. దీనికి పొక్క కొట్టుడు, చిల్లు కొట్టు-డు ఉండదు. ఆనాడు ఉమ్మడి ఏపీలో ఈనాటి కాంగ్రెస్ నేతలు పదవుల కోసం పెదవులు మూసుకోవడం వల్ల మీరు ఆడిందే ఆట పాడిందే పాట.. పోతిరెడ్డి పాడుకు పొక్క కొట్టి నీళ్లు తీసుకుపోయారు.. ఈనాటి కాంగ్రెస్ నాయకుల మౌనం వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. కానీ ఇక్కడున్నది బీఆర్ఎస్ పార్టీ. తెలంగాణ రాష్ట్రంగా ఉంది. ఇష్టమొచ్చినట్టు- పొక్క కొడుతాం అంటే చూసుకుంటూ ఊరుకోం అని నారా లోకేశ్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు.

## మరోసారి సుంకాలతో విరుచుకుపడిన ట్రంప్..

(మొదటి తరువాయి)

మినహాయింపునిచ్చారు.
పరస్పర సుంకాలు ఏ దేశంపై ఎంతంటే..
41 శాతం- సిరియా
40 శాతం- లావోస్, మయన్మార్
39 శాతం- స్విట్జర్లాండ్
35 శాతం- ఇరాక్, సెర్బియా
30 శాతం- అల్జీరియా, బోస్నియా, హెర్జ్‌గోవినా , లిబియా, దక్షిణాఫ్రికా
25 శాతం- భారత్, బ్రూనై, కజక్‌స్థాన్, మాల్డోవా, టునీషియా
20 శాతం- బంగ్లాదేశ్, శ్రీలంక, తైవాన్, వియత్నామ్
19 శాతం- పాకిస్థాన్, మలేషియా, ఇండోనేషియా, కంబోడియా, ఫిప్పీన్స్, థాయ్‌లాండ్
18 శాతం- నికరాగువా
15 శాతం- ఇజ్రాయెల్, జపాన్, టర్కీ, నైజీరియా, ఘనా, పలు ఇతర దేశాలు
10 శాతం- బ్రెజిల్, యూకే, ఫ్లాక్‌లాండ్ దీవులు

## మా దగ్గర ఆటంబాంబు లాంటి ఆధారాలున్నాయి..

(మొదటి తరువాయి)

అక్రమాలు జరిగాయని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఓటరు సవరణ చేపట్టి కోట్లాది మంది కొత్త ఓటర్లను అదనంగా చేరుస్తున్నారని, దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేస్తే ఈసీ వ్యవహారం బయటపడిందని చెప్పారు. ఆరు నెలలపాటు తాము సొంతంగా దర్యాప్తు జరిపి ఆటమ్ బాంబు లాంటి ఆధారాలను సాధించామన్నారు.ఆ బాంబు పేలిన రోజు ఎన్నికల సంఘం దాక్కోవడానికి కూడా అవకాశమే ఉండదని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. బీజేపీ కోసమే ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని, ఇది దేశద్రోహం కంటే తక్కువేం కాదని మండిపడ్డారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ఏ ఒక్కరినీ తాము వదిలిపెట్టబోమని హెచ్చరించారు. అధికారులు రిటైర్ అయినా, ఎక్కడ దాక్కున్నా కనిపెడతామని వార్నింగ్ ఇచ్చారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల

(మొదటి తరువాయి)

దీనిపై ఆగస్టు 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది. నామినేషన్లు దాఖలుకు చివరితేదీ ఆగస్టు 21గా ప్రకటించింది. పోలింగ్ తేదీ నాడే అంటే సెప్టెంబర్ 9నే ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీయే కూటమి.. ఎవరిని ఎంపిక చేస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రేసులో పలువురి పేర్లు తెర పైకి వచ్చాయి. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్, జేడీయూ నేత హరివంశ్ నారాయణ్ సింగ్, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సహా పలువురు నేతల పేర్లు ఉప రాష్ట్రపతి రేసులో ఉన్న సంగతి తెలిసిందే. పార్టీ సిద్ధాంతాలు, భావజాలానికి అనుగుణంగా వ్యవహరించే నేతకు భాజపా ఆ పదవిని అప్పగిస్తుందని సమాచారం. ఇదిలావుంటే ఆరోగ్యపరమైన కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ పంపారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే వైదొలిగారు. 74 ఏళ్ల ధన్‌ఖడ్ తర్వాత ఉప రాష్ట్రపతిగా ఎవరిని ఎన్నుకుంటారనే అంశంపై ఆసక్తి నెలకొంది. ఉభయ సభల్లో వివిధ ఖాళీలతో కలిపి సభ్యుల సంఖ్య ప్రస్తుతం 786గా ఉంది. ఇందులో మెజారిటీకి 394 మంది మద్దతు అవసరం. లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో 129 మంది మద్దతుంది. మరోవైపు విపక్ష కూటమికి లోక్‌సభలో 234 మంది సభ్యులు, రాజ్యసభలో 79 మంది సభ్యుల బలముంది. మొత్తంగా ఎన్డీయేకు 422 మంది, విపక్ష కూటమికి 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఇలా ఉభయ సభల్లో మెజారిటీ లేనప్పటికీ ఉప రాష్ట్రపతి ఎన్నికలో పోటీ చేసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## రష్యాతో చమురు బేరం కొనసాగుతుంది

(మొదటి తరువాయి)

ఏమీ లేదని భారత్ పేర్కొంది. ముఖ్యమైన ఎజెండాపైనే తమ రెండు దేశాలు దృష్టి సారించాయని, అదే విధంగా రష్యా నుంచి చమురు కొనుగోలుకు భారత్ కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం నాడిక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. భారత్-అమెరికా దేశాల భాగస్వామ్యం అనేక మార్పులు, సవాళ్లను ఎదుర్కొందని తెలిపారు. ఇందుకు అనుగుణంగానే ముఖ్యమైన ఎజెండాపైనే తాము దృష్టి సారించామని చెప్పారు. ఈ భాగస్వామ్యం కొనసాగుతుందని విశ్వసిస్తున్నట్టు- ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ సంబంధాల్లో అమెరికాతో భారత్ బలమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ఇవి మరింత బలపడ్డాయని చెప్పారు. ఏ రెండు దేశాల మధ్య సంబంధాలు మూడో దేశం కోణంలో చూడకూడదని, వివిధ దేశాలతో మన సంబంధాలు వేటికవే సొంత అర్హతలు కలిగి ఉన్నాయని జైశ్వాల్ అన్నారు. భారత్-రష్యా సంబంధాలపై మాట్లాడుతూ.. రెండు దేశాల మధ్య నిలకడైన సంబంధాలు ఉన్నాయని, కాలపరీక్షకు నిలిచిన భాగస్వామ్యం తమదని చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగానే తమ నిర్ణయాలు ఉంటాయని, దేశ ఇంధన ప్రయోజనాలను కాపాడుకోవడంతో భాగంగా అంతర్జాతీయ మార్కెట్లో అత్యుత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేసుకుని భారత్ ముందుకు సాగుతుందని అన్నారు. దేశ ఇంధన ప్రయోజనాలను కాపాడుకోవడంలో భాగంగా అంతర్జాతీయ మార్కెట్లో అత్యుత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు.

## సీఎం రేవంత్‌కు కాళేశ్వరం నివేదిక

(మొదటి తరువాయి)

కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో అన్ని రకాల వైఫల్యాలు జరిగాయని, దీనికి కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పలువురు కారణమని నివేదికలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ స్పష్టం చేసినట్లు- తెలిసింది. వ్యవస్థలు కాకుండా వ్యక్తుల ఇష్టాల ప్రకారం పనులు జరిగాయని, ఉన్నత స్థాయిలో వచ్చిన ఒత్తిడులకు లొంగి నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకొన్నారని, ఆర్థిక అవకతవకలు జరిగాయని... ఇలా పలు అంశాలను కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ పేర్కొన్నట్లు- సమాచారం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి డీపీఆర్ తయారీ మొదలుకొని మేడిగడ్డ బ్యారేజీ కుంగడం... అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సీపేజీల వరకు ఎప్పుడు ఏం జరిగింది... రికార్డుల ఆధారంగా ఎక్కడ ఎవరు బాధ్యులన్నది వివరంగా నివేదికలో తెలియజేసినట్లు- విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

## 2025 ఆగస్టు 2, శనివారం




మాసం-పక్షం
శ్రావణ మాసం (అమాంత)
శుక్లపక్షం
తిథి
అష్టమి తిథి - రాత్రి 12:20 వరకు
నవమి తిథి - ఆ తరువాత ప్రారంభమవుతుంది
నక్షత్రం
అనురాధ నక్షత్రం- రాత్రి 2:56 వరకు
జ్యేష్ఠ నక్షత్రం-ఆ తరువాత ప్రారంభమవుతుంది
శుభ సమయాలు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 12:00 - 12:52
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:26- 5:13
అమృతకాలం: రా. 2:42 - 4:27
అశుభ సమయాలు
రాహుకాలం: ఉదయం 9:08- 10:44
యమగండం: మధ్యాహ్నం 1:56- 3:32
దుర్ముహూర్తం: ఉదయం 6:36- 7:28 & మధ్యాహ్నం 12:52- 1:44
వర్జ్యం: సా. 4:55-6:39

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో గిరిజన పిల్లలకి ప్రవేశాల దరఖాస్తుల ఆహ్వానం

**వనపర్తి,ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వనపర్తి జిల్లాలో గిరిజన బాలబాలికల కోసం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతిలో డే స్కాలర్ కోటాలో చేరాలనుకునే విద్యార్థులు 2018 జూన్ 1 నుంచి 2019 మే 31 మధ్య జన్మించి ఉండాలని చెప్పారు. ఆసక్తిగల తల్లిదండ్రులు తమ దరఖాస్తులను ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కలెక్టరేట్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

## వనపర్తిలోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు




**వనపర్తి,ఆగష్టు 01(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డా. విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం వరకు అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కళాశాలలో బీకాం, బీఎస్సీ (జనరల్), అలాగే ఎంపీసీ, ఎమ్మెస్సీస్, ఎంఎస్‌సీఎస్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ అవకాశాన్ని ఎస్సీ విద్యార్థులు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాల కోసం 79950 10680, 99084 82839, 96184 58162 నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

## రెండవ రోజు జనహిత పాదయాత్రలో పాల్గొన్న కేఎల్ఆర్ , డిబిఆర్



**మహేశ్వరం,ఆగష్టు 01 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్రంలో పరిగి నియోజకవర్గంలో జనహిత.పాదయాత్ర.. శ్రమదానం... కార్యక్రమాన్ని ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, శాసన మండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో రెండవ రోజు జరుగుతున్న కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సారథ్యంలో మహేశ్వరం నియోజకవర్గం నుండి నాయకులు, కార్యకర్తలతో భారీ ఎత్తున బయలుదేరిన మాజీ శాసన సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యులు కిచెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు, అనంతరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని, మార్కెట్ కమిటీ, దేవాలయాల ఛైర్మన్స్, డైరెక్టర్లు మండల, డివిజన్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, విద్యార్థి సంఘ నాయకులు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## దోమలపై అవగాహన సదస్సు




**హైదర్‌నగర్, ఆగస్టు 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిజాంపేట్ రోడ్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో అర్బన్ మలేరియా స్కీమ్ కింద అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు పాల్గొన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వల వల్ల దోమల ఉత్పత్తి పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తాయని ఆయన హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నిల్వలపై మూతలు పెట్టాలని సూచించారు.ఎంటమాలోజి శాఖ, హెడ్‌మాస్టర్ సాయి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు




**శేరిలింగంపల్లి, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కేశవ్‌నగర్‌కు చెందిన పలు పార్టీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నూతన సభ్యులకు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు జెరిపేటి రామచంద్ర రాజు, రాజేంద్ర, కవి రాజ్, సూర్య రాథోడ్, మారెళ్ల శ్రీనివాస్, రామచంద్ర, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ నగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర



**ఆల్విన్ కాలనీ, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఛత్రపతి శివాజీ నగర్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను పరిశీలించేందుకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాదయాత్ర నిర్వహించారు.కాలనీ వాసుల విజ్ఞప్తిపై స్పందించిన ఆయన, సమస్యలపై అధికారులతో చర్చించి త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తామని, ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పాండుగౌడ్, పోశెట్టిగౌడ్, కాలనీ అధ్యక్షులు అంజయ్య యాదవ్, రమేష్, ఆంజనేయులు, కోటేశ్వరరావు, రాజు, పోచయ్య, తాత బాబు, రాజ్యలక్ష్మి, సౌందర్య, అరుణ, కృష్ణవేణి, స్వరూపా, దేవి, యోగేశ్వరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గా చింత బిచ్చయ్య



**దేవరకొండ, ఆగస్ట్ 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్గొండ జిల్లా డిండి మండలంలోని స్థానిక తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాల మరియు కళాశాల లో నూతన ఎన్ .ఎస్ .ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గా చింత బిచ్చయ్య నియామకమయ్యారు. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పసుపుల మద్దిలేటి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డి. నారాయణ రెడ్డి మరియు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ప్రోగ్రాం ఆఫీసర్ చింత బిచ్చయ్యకు అభినందనలు తెలియజేశారు.

## మీర్పేట్ సిఐగా శంకర్ నాయక్ బాధ్యతల స్వీకరణ

▫ ఘన సన్మానం



**మీర్పేట్, ఆగస్ట్ 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మీర్పేట్ పోలీస్ స్టేషన్ సిఐగా శంకర్ కుమార్ నాయక్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా స్థానిక సంఘాల నేతలు ఘనంగా సత్కరించారు. ఇందిరమ్మ హౌసెస్ కోఆర్డినేటర్, నాయి బ్రాహ్మణ సేవా సంఘం, నందనవనం ప్రతినిధులు పాల్గొని శాలువా, పుష్పగుచ్ఛాలతో సిఐని సన్మానించారు. ప్రజల భద్రతకు కట్టుబడి పనిచేస్తానని శంకర్ నాయక్ హామీ ఇచ్చారు.

## యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో టౌన్‌షిప్ శంకుస్థాపన



**దామరచర్ల, ఆగస్ట్ 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో నూతన టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు నల్లమాద ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆళ్లూరి లక్ష్మణ్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, డిసిసి ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా 950 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు శంకుస్థాపన చేశారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం 4,000 మెగావాట్ల సామర్థ్యంతో తెలంగాణ విద్యుత్ అవసరాలను తీర్చేందుకు నిర్మించబడుతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్ర విద్యుత్ సరఫరాలో స్థిరత్వం ఏర్పడనుందని అధికారులు తెలిపారు.

## ఘనంగా ఆటో డ్రైవర్ల దినోత్సవ వేడుకలు



**ఎలిగేడు, ఆగస్టు 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎలిగేడు మండల కేంద్రంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షుడు కవ్వంపల్లి శ్రీనివాస్ (బంగ్లా), మాజీ వార్డు సభ్యులు మామిడాల రమేష్, తాటిపల్లి సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ, రేయింబవలు కష్టపడుతూ ప్రయాణికులను వారి అవసరాల నిమిత్తం గమ్యానికి చేర్చే ఆటో డ్రైవర్ల సేవలు అమూల్యమని, ప్రభుత్వపరంగా వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోడూరు శ్రీనివాస్, ఎండి చాంద్ పాషా, కోట రమేష్, శ్యాంసుందర్, ప్రతాప్, లింగయ్య, శ్రీనివాస్, మండిగ శ్రీధర్ తదితర ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఘనంగా కూన వెంకటేష్ గౌడ్ విగ్రహ ఆవిష్కరణ



**గాజులరామారం, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బీసీ సెల్‌కి అధ్యక్షులుగా సేవలందించిన సీనియర్ నాయకుడు కీ.శే కూన వెంకటేష్ గౌడ్ విగ్రహాన్ని ఆయన కుటుంబ సభ్యులు గాజులరామారంలోని కెవిఎస్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన కుమారులు కూన శ్రావణ్ గౌడ్, కూన గౌరిశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్, కూన అంత్తయ్య గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం కూన వెంకటేష్ గౌడ్ జ్ఞాపకార్థంగా శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి బంగారు తోరణాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కూన కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా నిర్వహించారు.

# శంకర్ గౌడ్ అంకితభావంతో పనిచేసి వృత్తికే వన్నెతెచ్చారు

- శేషజీవితం కాదు విశేషమైన జీవితాన్ని సమాజసేవకు అంకితం చేయాలి
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి,ఆగష్టు 01 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కళా సాహితీ వేదిక అధ్యక్షులు, ప్రధానోపాధ్యాయులు పలుస. శంకర్ గౌడ్ పదవీ విరమణ వీడ్కోలు సభ శ్రీ లక్ష్మీ కృష్ణ గార్డెన్ నందు ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులతో ఘనంగా జరిగింది.ఇట్టి సమావేశానికి మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి,మాజీ ఎం.పి, ఎం.ఎల్.ఏ రావుల.చంద్రశేఖర్ రెడ్డి, ముఖ్య అతిథిలుగా హాజరై పలుస.శైలజా శంకర్ గౌడ్ దంపతులను ఘనంగా సన్మానించారు.ఈ సమావేశములో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ,శంకర్ గౌడ్ అంకితభావంతో పనిచేసి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చినారు అని రిటైర్మెంట్ తర్వాత తన శేషజీవితాన్ని కాదు తన అనుభవంతో సమాజ సేవకు విశేషమైన జీవితాన్ని ఉపయోగించాలని సూచించారు. శంకర్ గౌడ్ రిటైర్మెంట్ నిన్న జరిగింది ఈరోజు తన పుట్టినరోజు కావడం యాదృచ్ఛికం అయినా సమాజములో శంకర్ గౌడ్ నూతన పాత్ర పోషించటానికి నాంది కావాలని ఆకాంక్షించారు.

సాహితీ కళావేదిక ప్రారంభించి ఎందరో కళాకారులను,సంస్కృతి సాంప్రదాయాలను సమాజానికి తెలియజేసినారని వారి మున్ముందు చేయబోయే కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందని మరోసారి వారికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలకు చేరాలంటే గురువుల బోధన,ఆశీర్వాదం ముఖ్యమని అటువంటి ఉపాధ్యాయ వృత్తిని నిర్వర్తించిన శంకర్ గౌడ్ ధన్యజీవి అని కొనియాడారు.శంకర్ గౌడ్ వృతి ఉపాధ్యాయుడు అయిన ప్రవృతి రీత్యా ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు,సమాజ సేవలు చేశారని వారు స్థాపించిన కళా సాహితీ వేదిక భవిష్యత్తు తరాలకు మార్గదర్శనమైంది అని అన్నారు.వనపర్తి సంస్థానం విద్యకు,సాగునీరు,తాగు నీరుకు పాలకులు పెట్టింది పేరని అటువంటి మన వనపర్తిని పాలకులు ఎవరైనా బ్రాండ్ ఇమేజ్ కాపాడాలని సూచించారు.ఈ కార్యక్రమములో గట్టు యాదవ్, వామను గౌడ్,వాకిటి శ్రీధర్,పలుస.రమేష్ గౌడ్,నందిమల్ల.అశోక్, ఉపాధ్యాయులు,రవిప్రసాద్, కంటే. ఆంజనేయులు, వరప్రసాద్,జన జ్వాల.రాధాకృష్ణ,రాజారాం ప్రకాష్, షేక్.జహంగీర్, బండారు.కృష్ణ, ఉంగ్లం. తిరుమల్, నాగన్న యాదవ్, ఆవుల.రమేష్,యుగంధర్ రెడ్డి,చిట్యాల. రాము తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

- 45 వాహనాలు స్వాధీనం
- ప్రజలకు అవగాహన




**కరీంనగర్, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీల్లో సరైన ధృవపత్రాలు లేని 45 వాహనాలు (43 బైకులు, 2 ఆటోలు) స్వాధీనం చేసుకున్నారు.ఆపరేషన్ అనంతరం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం, ట్రాఫిక్ నియమాలు, షీ టీం సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే గంటలోపల 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. షీ టీం ఇన్‌స్పెక్టర్ శ్రీలత గారు యువతికి సోషల్ మీడియా మోసాలపై సూచనలు చేశారు.చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. డ్రగ్ రహిత సమాజ నిర్మాణం కోసం అధికారులు, విద్యార్థులు, స్థానికులు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు నిరంజన్ రెడ్డి, శ్రీలత, పుల్లయ్య, ప్రదీప్ కుమార్, 150 మంది పోలీసు సిబ్బంది, 500 మంది స్థానికులు పాల్గొన్నారు.

## రామగుండంలో కాంగ్రెస్ కీలక భేటీ

- రైతులకు బండలవాగు, ముర్మూర్ ప్రాజెక్టుల ద్వారా శాశ్వత నీటి ఊరట



**రామగుండం, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు గాంధీనగర్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం జరిగింది. కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, సోషల్ మీడియా టీం పాల్గొన్నారు.ఈ సందర్భంగా బొంతల రాజేష్ మాట్లాడుతూ "ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కృషితో అంతర్గాం, పాలకుర్తి మండలాల్లో బండలవాగు, ముర్మూర్ ఎత్తిపోతల ప్రాజెక్టులు ప్రారంభం కానున్నాయి. వేల ఎకరాలకు సాగునీరు అందబోతుండటంతో రైతులకు శాశ్వత ఊరట కలుగనుంది" అని తెలిపారు. ఈనెల 3న ఉదయం 10 గంటలకు అంతర్గాం మండల కేంద్రంలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్ కుమార్ పాల్గొననున్నారు. వారికి ఘన స్వాగతం, ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపేందుకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.ప్రతి డివిజన్ నాయకులకు, కార్యకర్తలకు గ్రామ ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ ప్రాజెక్టులు సాగునీటి సరఫరా, భూగర్భ జలాల రీచార్జ్ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయనున్నాయి.

## నేడు చొప్పదండిలో మోడీ గిఫ్ట్ కార్యక్రమం

**చొప్పదండి, ఆగస్టు 2(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదినం సందర్భంగా "మోడీ గిఫ్ట్"గా సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా ప్రభుత్వ పాఠశాలలో జరుగనున్న ఈ కార్యక్రమానికి మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. మండల అధ్యక్షుడు పంజాల ప్రశాంత్ ప్రజలను హాజరుకావాలని కోరారు.

## పదరలో బీజేపీ ఎన్నికల కార్యశాల

- ప్రతి కార్యకర్త లక్ష్య సాధనకు కృషి చేయాలి
- వరికుప్పల ఆంజనేయులు



**పదర, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పదర మండల కేంద్రంలోని శివాలయ ప్రాంగణంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీలం రవి ముదిరాజ్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రభారి వరికుప్పల ఆంజనేయులు మాట్లాడుతూ, ఈసారి స్థానిక ఎన్నికలు కీలకంగా మారాయని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి బీజేపీ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు.గ్రామాల్లో రోడ్లు, నీటి సరఫరా, విద్యుత్, ఆరోగ్య సేవలు, విద్యా రంగ అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాలు కేంద్రం ద్వారా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శ్రీను యాదవ్, జనరల్ సెక్రటరీ రవి కుమార్, సీనియర్ నాయకులు హనుమంత్ నాయక్, చంద్రయ్య యాదవ్, రామ్ యాదవ్, ఎల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయంలో కుంకుమ పూజ

- ఆరోగ్య శిబిరాన్ని సందర్శించిన బీజేపీ నేత సునీల్ రావు





**కరీంనగర్, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రావణ మాస తొలి శుక్రవారం సందర్భంగా భగత్‌నగర్‌లోని శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో విశిష్టంగా కుంకుమ పూజ నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పుష్పాలు, కుంకుమతో అర్చనలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేత, మాజీ మేయర్ వై. సునీల్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు కొలకని నర్సయ్య, పండుగ నాగరాజు, పిట్టల లింగయ్య, రాగిళ్ల లక్ష్మణ్, కంకటి శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 33వ డివిజన్‌లోని చైతన్య యూత్ క్లబ్ భవనంలో నిర్వహించిన "ఆరోగ్య మహిళ" ఉచిత వైద్య శిబిరాన్ని సునీల్ రావు సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్, వైద్య సిబ్బంది, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజల కోసమే జనహిత పాదయాత్ర

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- బీసీ రిజర్వేషన్ల సాధనకు కలిసి రండి





**ఇబ్రహీంపట్నం,ఆగస్టు 01(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లని.. అందుకే వారి కోసం పాదయాత్ర చేస్తున్నామని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. వికారాబాద్ జిల్లా పరిగిలో కాంగ్రెస్ చేపట్టిన జనహిత పాదయాత్ర ... పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు , తో కలిసి రంగారెడ్డి జిల్లా పరిగి నియోజకవర్గ కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తమ అధినాయకత్వం డిమాండ్ చేస్తుంటే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముఖం చాటేస్తోందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులను కోరారు.


## వర్గీకరణ తో మాలలకు అన్యాయం

### రోస్టర్ విధానం రద్దు చేయాలి



**అచ్చంపేట, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎస్సీ వర్గీకరణతో మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని మాల మహానాడు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన వారు, గ్రూప్ 3లో 22వ రోస్టర్ పాయింట్ (విమెన్) కేటాయింపు దుర్మార్గమని పేర్కొన్నారు.జీవో 99 ద్వారా అమలు చేస్తున్న రోస్టర్ విధానం మాల విద్యార్థులు, ఉద్యోగుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తోందని, సుప్రీంకోర్టు సూచనలు పరిగణనలోకి తీసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొందరపడ్డాయని విమర్శించారు.మాల సామాజిక వర్గానికి 7 శాతం రిజర్వేషన్ కల్పించాలని, పాత విధానంలోనే సీట్ల కేటాయింపు జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు అవుట రామకోటి, కుంద మల్లికార్జున్, పోతుల అనిల్ కుమార్, కిన్నెర పాండు, పెరుముల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు రంగం సిద్ధం



**హనుమకొండ, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తరగతుల వసతులను శుక్రవారం రోజున పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిడబ్ల్యుఎంసి కమిషనర్ చౌహాన్ బాజ్ పాయ్ తదితరులు పాల్గొన్నారు.అధికారులతో కలిసి స్టేడియంలో ఉన్న బాలుర, బాలికల వసతి గృహాలను పరిశీలించారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో హైదరాబాద్ హకీంపేటలో మాత్రమే ఉన్న స్పోర్ట్స్ స్కూల్ తరహాలో, రెండో క్రీడా పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని తెలిపారు.మొదటి దఫా తరగతుల ఏర్పాటుకు విద్యార్థులకు అవసరమైన వసతులు, సౌకర్యాలపై కచ్చితమైన ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

# గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ

- గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ యూత్ వింగ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా శ్యామ్ సుందర్ రెడ్డి



**కరీంనగర్, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యువతకు ఆదర్శంగా నిలిచే లక్ష్యంతో, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ - గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ యూత్ వింగ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీ వి. శ్యామ్ సుందర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ విషయాన్ని సంస్థ గౌరవ ప్రచారక చైర్మన్ మాజిద్ ఖాన్ గారు ప్రకటించారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని ఆయన తెలిపారు. యువతలో గాంధీయ సిద్ధాంతాలను వ్యాప్తి చేయాలన్న సంకల్పంతో శ్యామ్ సుందర్ రెడ్డి ఈ బాధ్యతను స్వీకరించారు. ఆయనకున్న అంకితభావం, నాయకత్వ లక్షణాలు యూత్ వింగ్‌ను కొత్త దిశగా నడిపిస్తాయని సంస్థ విశ్వసిస్తోంది. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ మాట్లాడుతూ, "గాంధీ సిద్ధాంతాలను యువతకు చేరువ చేయడం నా ప్రధాన లక్ష్యం. ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, సంస్థ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తాను," అని తెలిపారు. ఆయన పదవీకాలం ఒక సంవత్సరం పాటు ఉంటుంది. అయితే, ఆయన నిబద్ధత, పనితీరు ఆధారంగా పదవీకాలాన్ని పొడిగించే అవకాశం ఉందని సంస్థ వర్గాలు పేర్కొన్నాయి.

# సింగరేణి రక్షణ కోసం బిఎంఎస్ ఉద్యమ బాట



**గోదావరిఖని, ఆగస్ట్ 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సింగరేణి బొగ్గు గనుల భవితవ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, కార్మిక హక్కుల పరిరక్షణకు బిఎంఎస్ (భారతీయ మజ్దూర్ సంఘ్) ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. సంస్థ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య నేతృత్వంలో ఉద్యమ దశలను ప్రకటిస్తూ, కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర ప్రణాళికను రూపొందించారు. ఈ ఉద్యమం తొలి అడుగులు జూలై 24న ప్రారంభమయ్యాయి. గనుల వద్ద పిట్ మీటింగ్‌లు, గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తూ కార్మికుల్లో చైతన్యం నింపారు. ఆ తర్వాత ఆగస్టు 5 నుంచి 14 వరకు బొగ్గు గనుల చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రామస్థుల మద్దతుతో ఉద్యమానికి మరింత బలాన్ని చేకూర్చే ప్రయత్నం చేస్తున్నారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 5 వరకు బహిరంగ సమావేశాలు, ప్రెస్ కాన్ఫరెన్సులు నిర్వహించనున్నారు. ఉద్యమ లక్ష్యాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వాన్ని ఒత్తిడికి గురిచేయాలన్నది బిఎంఎస్ ఉద్దేశ్యం. చివరగా సెప్టెంబర్ 15న కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్, ఎన్ఎల్సీఐఎల్ ప్రాంతీయ కార్యాలయాల వద్ద ఒక రోజు ధర్నా నిర్వహించనున్నారు. ఇది ఉద్యమానికి కీలక మలుపు కావనిపిస్తోంది. ఈ ఉద్యమానికి మద్దతుగా కార్మికులు, గ్రామస్తులు, వ్యాపారులు, పరిశ్రమల వల్ల ప్రభావితమైన నిర్వాసితులు, సాధారణ ప్రజలు ముందుకు రావాలని యూనియన్ విజ్ఞప్తి చేసింది. ఉద్యమ ప్రచారంలో భాగంగా వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ పిన్నమనేని వేణుగోపాల్ రావు, ఏరియా ఉపాధ్యక్షులు అరుకాల ప్రసాద్, బ్రాంచ్ కార్యదర్శి రౌత్ రమేష్, సంయుక్త కార్యదర్శి విద్యాసాగర్, పిట్ కార్యదర్శి పాక కృష్ణ, నాయకులు జానీ, కందుల భీమరి మహేష్, మినుగు సంతోష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెల్దండ బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఏబీవీపీ నాయకులు



**వెల్దండ, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మండల శాఖ ఆధ్వర్యంలో నాయకులు సందర్శించారు. సాయంత్రం భోజన సమయానికి హాస్టల్‌ను పరిశీలించిన ఏబీవీపీ మండల కన్వీనర్ రేణుకుంట్ల శ్రీకాంత్, విద్యార్థులతో కలిసి భోజన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో ఎలాంటి రాజీ ఉండకూడదు. హాస్టల్‌లో భోజన నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ అవసరం," అని పేర్కొన్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులు స్పందిస్తూ, హాస్టల్ వార్డెన్ శ్రీరాములు నాణ్యమైన భోజనం అందిస్తున్నారని తెలిపారు. హాస్టల్‌లో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు ఏబీవీపీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని శ్రీకాంత్ హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు మణికంఠ, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం చేయాలి

- అడిషనల్ కలెక్టర్ అశ్విని



**కరీంనగర్, ఆగస్టు 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను గ్రామ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఐసిడీఎస్, ఆరోగ్యశాఖ సిబ్బంది గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా ఆసుపత్రుల సందర్శన, పోస్టర్లు, బ్యానర్లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా 148 మంది చైల్డ్ కేర్ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. వీటి ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు పొందవచ్చు.

## నాగర్ కర్నూల్ కలెక్టర్ కు పరామర్శ

**జఫర్గడ్ ఆగస్టు 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మండలంలోని సూరారం గ్రామంలో నాగర్ కర్నూలు కలెక్టర్ సంతోష్ నాయక్ తల్లి శాంతమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హాజరై శాంతమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అందుబాటులో ఉన్న మాజీ ప్రజా ప్రతినిధులు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణ సమితి యొక్క లక్ష్యాలు మరియు మిషన్

**లక్ష్యం**

సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవనవాతావరణం కోసంపర్యావరణాన్ని రక్షిస్తూ, ప్రజల ఆరోగ్యం, ఆయుష్షు పెంపుకు కృషి చేయడం.

**మిషన్**

- శాస్త్రీయ పద్ధతుల్లో పర్యావరణ పరిరక్షణ
- గాలి, నీరు, నేలపై కాలుష్య నివారణ
- విద్య, సాంకేతికతతో ప్రజల్లో అవగాహన
- యువతకు పది వేల ఉద్యోగ అవకాశాలు
- అభివృద్ధి -పర్యావరణాన్ని సమతుల్యంగా ముందుకు నడిపించడం
- మాదకద్రవ్యాల రహిత భారత దేశ ఆవిష్కరణ
- భారతీయ సాంప్రదాయాల విస్తృత ప్రచారం

పర్యావరణ పరిరక్షణ సమితి
చెట్టు = అమ్మ
Reg No. 643/2025
Nurture Nature, Promote Wellness

# చేనేత హస్తకళలకు ప్రోత్సాహం






- కళాభారతిలో ఎగ్జిబిషన్ ప్రారంభించిన సుడా చైర్మన్

**కరీంనగర్, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కళాభారతిలో ప్రారంభమైన చేనేత హస్తకళల ఎగ్జిబిషన్‌ను శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రారంభించారు. దేశ సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుగా నిలిచే చేనేత, హస్తకళలకు జీవం పోసే ఈ ప్రదర్శనలో దేశవ్యాప్తంగా ఉన్న కళాకారుల ఉత్పత్తులు ప్రదర్శించబడ్డాయి. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "చేనేతలు, హస్తకళలు శ్రమైఖ్య జీవన సౌందర్యానికి ప్రతీకలు. ప్రజలు నేరుగా కొనుగోలు చేయడం వల్ల తక్కువ ధరలకు నాణ్యమైన వస్తువులు పొందే అవకాశం ఉంటుంది," అని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కళాభారతి చేనేత సంఘం మేనేజర్ జల్ల సత్యనారాయణ, జి. సంతోష్ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముకరంపురలోని బీసీ బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా సందర్శించిన నరేందర్ రెడ్డి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అనే విషయాన్ని పరిశీలించారు. వార్డెన్ "మధ్యాహ్న భోజనాన్ని సాయంత్రం అందిస్తున్నాం" అని చెప్పగా, నరేందర్ రెడ్డి "మెనూ ప్రకారం ఏ భోజనం ఎప్పుడు ఇవ్వాలో అప్పుడు ఇవ్వాలి" అని స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మెస్ ఛార్జీలు పెంచిందని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని సూచించారు.

# రవీంద్రభారతిలో నేడు దేశభక్తి జన్ అవార్డుల ప్రధానం ...

- అభినందించిన వి.హనుమంతరావు...



**అంబర్పేట్, ఆగస్టు 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రవీంద్రభారతిలో దేశభక్తి జన్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం రవీంద్ర భారతి లో శనివారం మధ్యాహ్నం 4 గంటలకు జరగనున్నది. సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంత రావుకు అంబర్పేట్ లోని ఆయన నివాసంలో ఫౌండేషన్ సలహాదారులు ఉప్పు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని దేశభక్తి జన్ అవార్డులను ప్రధానం చేయడం అభినందనీయమన్నారు. బాల కార్మికుల నిర్మూలన అంశంపై కూడా చర్చ గోష్టిని నిర్వహిస్తున్నట్లు ఉప్పు సత్యనారాయణ విహెచ్ కు ఈ సందర్భంగా వివరించారు. ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి విహెచ్ ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించిన వారిలో విశ్రాంత ఉద్యోగులు రాంపల్లి జైహింద్, గొల్లాల అశోక్ తదితరులు ఉన్నారు.

# హోంగార్డు లింగయ్యకు ఘన వీడ్కోలు



**కరీంనగర్, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో 23 సంవత్సరాల పాటు విధులు నిర్వహించిన హోంగార్డు దాసరి లింగయ్య శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆయనను ఘనంగా సన్మానించారు. పూలమాల వేసి, శాలువాతో సత్కరించిన కమిషనర్, లింగయ్య సేవలను ప్రశంసిస్తూ జ్ఞాపికను అందజేశారు. దీర్ఘాయుష్షు, మంచి ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మోడెం సురేష్, హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దశ దిన కార్యక్రమం లో పాల్గొన్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు

**జఫర్గడ్ ప్రతినిధి**
మండలంలోని,సూరారం గ్రామం నందు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తల్లి బదావత్ శాంతి సంస్మరణ సభ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య హాజరై వారి చిత్ర పటానికి నివాళులు అర్పించారు. వారితో పాటుగా మాజీ ఎంపీపీ కాంగ్రెస్ జిల్లా నాయకులు మనోజ్ రెడ్డి ఎంపీడీఓ సుమన్, పార్టీకి ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# ప్రతి కాలనీ అభివృద్ధే లక్ష్యం





- 50వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**హనుమకొండ, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్ జులైవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రతి కాలనీ అభివృద్ధే మా లక్ష్యం. మౌలిక సదుపాయాలు, మంచినీటి సరఫరా, డ్రైనేజ్ వ్యవస్థ, సీసీ రోడ్లు వంటి అంశాల్లో ఎటువంటి లోటుపాటులుండకుండా చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే ఎన్నికల నాటికి అన్ని డివిజన్ల అభివృద్ధి పూర్తయ్యేలా కార్యచరణ రూపొందించాం," అని తెలిపారు. అనంతరం సుబేదారిలో నూతనంగా నిర్మించిన ఎక్సైజ్ శాఖ విశ్రాంతి భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**భద్రకాళి అమ్మవారి దర్శనం – అభివృద్ధి పనులకు ప్రభుత్వం కట్టుబాటు**

శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రోచ్ఛరణతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఈ ప్రాంత ప్రజలకు భద్రకాళి అమ్మవారు ఒక నమ్మకం. అమ్మవారి దర్శనానికి ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయడం మా బాధ్యత. ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ప్రతి శుక్రవారం సుమారు 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు జీఓ విడుదలైంది," అని తెలిపారు. ప్రస్తుతం భద్రకాళి ఆలయంలో రూ.54 కోట్లతో మాడ వీధుల విస్తరణ, రాజగోపురాల నిర్మాణం, ధ్యాన మండపం, భక్తుల వసతికి గదులు, అన్నదాన సత్రం, మహారథం వంటి పలు అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి
- ఆరుట్లలో ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడత బిల్లులు మరియు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ





**మంచాల,ఆగస్టు 01(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు శుక్రవారం రోజున ఆరుట్ల గ్రామంలో బేస్ మెంట్ వరకు నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లకు మొదటి విడత బిల్లుల పత్రాలను మరియు గ్రామంలోని సీఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులకు చెక్కులను అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని ఇందిరమ్మ ఇండ్లు కొత్త రేషన్ కార్డులు సన్నబియ్యం తదితర పథకాల ద్వారా పేదలందరూ లబ్ది పొందుతున్నారని అన్నారు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా పేదలకు ప్రయోజనం చేకూరుతుందని నిరుపేదలు దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షకార్యదర్శులు రావుల భాషయ్య దాసరమోని రమేష్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నర్సింహా బుట్టి కృష్ణ కంబాలపల్లి బుగ్గరాములు మార లక్ష్మణ్ కోరే బాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య మార సురేష్ అంతటి రాజుగౌడ్ వెదిరే రమణారెడ్డి పంబాల బుగ్గరాములు మాణిపాటి వెంకటేష్ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి తలారి కృష్ణ ఎండి గాలెబ్ భాస్కర్ రైనా పాండాల శ్రీనివాస్ కావలి దర్శన్ చిందం ఐలయ్య ఆర్ల శ్రీకాంత్ రావుల నాగరాజు ఎండి అశ్రఫ్ మంకు ప్రవీణ్ విశ్వనాథ్ చారి సుంకరి దానయ్య మాణిపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


# రేపు వైశ్య వికాస వేదిక వైశ్య రాజకీయ రణభేరి విజయవంతం చేయాలి

- నాగరాజు గుప్తా



**యాచారం,ఆగస్టు 01( నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రేపు హైదరాబాదులో వైశ్య వికాస వేదిక చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో సాయంత్రం 3 గంటలకు వైశ్య వికాస వేదిక రాజకీయ రణభేరి కార్యక్రమం ఈ నెల 3 తేదీన జరగనుంది ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి (ఏసిపి )రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరుగు నాగరాజు గుప్తా ఒక ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆత్మగౌరవం హక్కుల సాధనకి నిర్వహించి ఈ రాజకీయ రణభేరి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశం విజయవంతం చేయాలని తెలిపారు.

## శాంతినగర్‌లో తల్లిపాల వారోత్సవాలు



**కరీంనగర్, ఆగస్టు 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):** శాంతినగర్ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు, శుక్రవారం సభ నిర్వహించారు. సీడీపీవో సబిత మాట్లాడుతూ ముర్రుపాల ప్రాధాన్యత, నార్మల్ డెలివరీ లాభాలు గురించి అవగాహన కల్పించారు. ప్రతి గర్భిణీ, బాలింత శుక్రవారం సభకు హాజరై తమ సమస్యలు వినవించుకోవాలని సూచించారు. డిఎంహెచ్ఓ వెంకటరమణ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా 50 రకాల ఉచిత పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సభలో ఐసీడిఎస్, హెల్త్ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, మహిళలు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# రమణ రెడ్డి నీచ రాజకీయాలు మానుకోవాలి:కాంగ్రెస్ నేతలు



**భూపాలపల్లి, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ ఎమ్మెల్యే రమణ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటే, రమణ రెడ్డి వికృత ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. "సెగ్గంపల్లిలో ఇల్లు కూలగొట్టింది నీవే కదా, ఇప్పుడు అదే చర్యలు చట్టబద్ధంగా జరిగితే ఎందుకు విమర్శ?" అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని నేతలు హెచ్చరించారు.

## కరీంనగర్‌లో బీసీ రిజర్వేషన్ల సాధన సభకు ఏర్పాట్లు

- సభా స్థలాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు



**కరీంనగర్, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఆగస్టు 8న కరీంనగర్ సర్కస్ గ్రౌండ్‌లో బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో, బీఆర్ఎస్ నేతలు సభా స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ రావు, మధుసూదనాచారి, స్వామి గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, రసమయి బాలకిషన్, ముఠా గోపాల్, విద్యాసాగర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి నాగార్జునసాగర్‌కు ఆర్టీసీ ప్రత్యేక విహారయాత్ర

**దిల్‌సుఖ్‌నగర్, ఆగస్టు 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):** విహారయాత్ర ప్రియుల కోసం టీఎస్ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపో ఆధ్వర్యంలో నేటి నుంచి ఈ ప్యాకేజీని ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సమత ఒక ప్రకటనలో తెలిపారు. 40 మంది సామర్థ్యం గల మెట్రో డీలక్స్ బస్సు శనివారం ఉదయం 5 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ నుంచి బయలుదేరి, నాగార్జునసాగర్ ప్రాంతంలోని ప్రముఖ ప్రదేశాలను సందర్శించి అదే రోజు రాత్రి 8 గంటలకు తిరిగి చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ విహారయాత్రలో చింతపల్లి సాయిబాబా దేవాలయం, నాగార్జునసాగర్ డ్యామ్, వైజాగ్ కాలనీ, ఎత్తిపోతల ప్రాజెక్టు వంటి ప్రదేశాలను చూపించనున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ.900, పిల్లలకు రూ.500 చార్జీగా నిర్ణయించినట్లు వెల్లడించారు. టూర్ ప్యాకేజీకి సంబంధించి మరిన్ని వివరాల కోసం బుచ్చిరెడ్డి (ఫోన్: 79899 28321), ఎంఎస్‌రెడ్డి (ఫోన్: 90631 02132)లను సంప్రదించాలని సూచించారు.

# యూరియా సరఫరా సకాలంలో జరగాలి


- వ్యవసాయ డైరెక్టర్ డా. బి. గోపి



**హైదరాబాద్, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో యూరియా వినియోగం గరిష్టంగా ఉండే ఆగస్టు మాసానికి కేంద్ర ప్రభుత్వం 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా ప్రణాళికను కేటాయించింది. ఈ మేరకు వ్యవసాయ డైరెక్టర్ డా. బి. గోపి, ఐఏఎస్, యూరియా సరఫరా చేసే కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ వరకు కేటాయించిన మొత్తం యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కంపెనీలను ఆదేశించారు. వరి నాట్లు పూర్తయ్యే దశలో యూరియా అప్లికేషన్ అత్యవసరంగా ఉండటంతో ఎరువుల సరఫరాలో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. సరఫరా ప్రక్రియలో ట్యాగ్గింగ్ లేదా లింకింగ్ వంటి అక్రమ చర్యలకు పాల్పడవద్దని కంపెనీలను హెచ్చరించారు. యూరియాను విచక్షణారహితంగా వాడకుండా, డీలర్ల ద్వారా రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎరువుల సరఫరా నిరంతరం పర్యవేక్షించాలని డీఏవోల కు ఆదేశించారు. బల్క్ సేల్స్, బోర్డర్ తనిఖీలు, బ్లాక్ మార్కెటింగ్ వంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. యూరియాను బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మర్క్ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, అదనపు వ్యవసాయ సంచాలకులు శ్రీ కె. విజయ్ కుమార్, జేడీఏ బాలు, సంబంధిత అధికారులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీసీ కమ్యూనిటీ కాంప్లెక్స్ ని నిర్మించండి..

- ఆకుల శ్రీ వాణి



**సరూర్ నగర్,ఆగస్టు 01 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం సరూర్నగర్ మాజీ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మాట్లాడుతూ బీసీ సామాజిక ఆర్థిక అభివృద్ధికి సరూర్నగర్లో కొత్తపేట ఓల్డ్ కోర్టు స్థలం వద్ద బీసీ కమ్యూనిటీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని.. హెచ్ఎండిఏ కమిషనర్ స్వరూప్ రాజ్ కి వినతి పత్రం అందించి బీసీ సోదరులకు స్వయం ఉపాధికి మార్గం చూపాలని ఆకుల శ్రీవాణి కోరడం జరిగింది.

## నేడు కేంద్ర మంత్రి వర్యులు జి కిషన్ రెడ్డి రాక



**యాచారం,ఆగస్టు 01 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** ప్రధాని నరేంద్ర మోడీ కిసాన్ సమ్మాన్ నిధి 20 విడుత నిధులను వారణాసి లో జరిగే కార్యక్రమం లో విడుదల చేయనున్నారు. ఇదే కార్యక్రమనికి కొనసాగింపు లో భాగంగా యాచారం మండల కేంద్రంలో ఉన్న రైతు వేదిక దగ్గర ఈరోజు ఉదయం 9 గంటలకు కిసాన్ సమ్మాన్ నిధి నిధులను విడుదల చేయడానికి కేంద్ర గనుల మరియు బొగ్గు శాఖ మంత్రి వర్యులు జి కిషన్ రెడ్డి రానున్నారని బిజెపి యాచారం మండలం అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ ఒక ప్రకటన లో తెలిపారు. కావున బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమన్ని విజయవంతం చేయాలని కోరారు.

## గుండారం మాజీ సర్పంచ్ ను పరామర్శించిన మంథని డివిజన్ యూత్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ యూసుఫ్ లల్లూ



**కమాన్ పూర్,ఆగస్టు1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కమాన్ పూర్ మండలం గుండారం తాజా మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు వెన్నుముక సర్జరీ చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా గురువారం మంథని డివిజన్ యూత్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ యూసుఫ్ లల్లూ ఆయనను పరామర్శించారు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు ఆయన వెంట యూత్ కాంగ్రెస్ నాయకులు నల్లెల్లి శంకర్ కొంతం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఏసీబీ వలలో భూత్పూర్ ఆర్ఐ

- కళ్యాణలక్ష్మి పథకంలో లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబాటు



**భూత్పూర్, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) బాలసుబ్రమణ్యం లంచం తీసుకుంటూ శుక్రవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కళ్యాణలక్ష్మి పథకం సంబంధిత పని కోసం ఒక గ్రామస్థుడు ఆధారాలతో ఏసీబీకి ఫిర్యాదు చేయగా, మండల ఆసుపత్రి సమీపంలో రూ.4,000 లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. భూత్పూర్ రెవెన్యూ కార్యాలయంలో గతంలోనూ లంచాల వసూలు ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయంలో పూర్తి స్థాయిలో విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనతో స్థానికంగా కలకలం రేగింది.




## దేవాదాయ శాఖ ఉద్యోగుల సంక్షేమం కోసం వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్సీ డా. సి. అంజిరెడ్డి




**హైదరాబాద్, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ డా. సి. అంజిరెడ్డి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. దేవాదాయ శాఖ పరిధిలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, పూజారుల సంక్షేమం కోసం పలు అంశాలను వినతిలో పేర్కొన్నారు.వారి కోసం కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, అలాగే ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి యోజన, ఎస్బీఐ లైఫ్ వంటి భీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. దేవాలయాల్లో సేవలందిస్తున్న వారికి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

# అంగన్వాడి సేవలు వినియోగించుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



**తిమ్మాపూర్, ఆగస్టు 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నుస్తులాపూర్ అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. గర్భిణీలు, బాలింతలు అంగన్వాడి సేవలు వినియోగించుకోవాలని సూచించారు. పోషణ ఆరోగ్య దినం సందర్భంగా చిన్నారులకు బాలామృతం, గ్రుడ్లు పంపిణీ చేశారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలను పరిశీలించి, పిల్లలతో మమేకమయ్యారు. అంగన్వాడీ సిబ్బందికి సిలబస్ ప్రకారం బోధన నిర్వహించాలని ఆదేశించారు. అదే సమయంలో నుస్తులాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకూ వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. నేలపై కూర్చోబెట్టిన విషయంపై ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేసి, బెంచీలపై కూర్చోబెట్టాలని సూచించారు.



హర్యానా మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా ఆయన రచించిన "ప్రజలకథే నా ఆత్మకథ" పుస్తకాన్ని అందుకున్న బిజెపి సీనియర్ నాయకులు పి. సుగుణాకర్ రావు


## బండి సంజయ్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు సైకిళ్ల కానుక



**తంగళ్లపల్లి, ఆగస్టు 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బండి సంజయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని "మోదీ కానుక"గా పదో తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాలలో 29 సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, స్కూల్ హెచ్ఎం అనురాధ, మండల అధ్యక్షుడు శ్రీధర్ రావు, బీజేవైఎం నేతలు రాజిరెడ్డి, రాజు రావు, అఖిల్, ఇటికల రాజు, బండి లక్ష్మి, తుపాకుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోవు సేవ శుభాలను తెస్తుంది

– డా. గుమ్మడివెల్లి శ్రీనివాస్





**ఎల్బీనగర్, ఆగస్టు 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసంలో ప్రముఖ గోరక్షకుడు డా. గుమ్మడివెల్లి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోవు పర్యావరణ పరిరక్షణపై శాస్త్రీయ చర్చ జరిగింది. ఆయన మాట్లాడుతూ, గోవు శ్రీకృష్ణునికి ప్రియమైనది, గోవు సేవ చేసే వారికి 33 కోట్ల దేవతల ఆశీస్సులు లభిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. గోపూజ, గోదానం వంటి కార్యాలు పుణ్యాన్ని కలిగిస్తాయని వివరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కిరణ్ కుమార్, గాలి వెంకట్ రంగారెడ్డి, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్బీఐలో పదవీ విరమణ పొందిన డి. ప్రభాకర్ రావును ఘనంగా సన్మానించిన సహచరులు



**దేవరకొండ, ఆగస్ట్ 1 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేవరకొండ శాఖలో 17 సంవత్సరాల సేవ అనంతరం డి. ప్రభాకర్ రావు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్, బ్యాంకు సిబ్బంది ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ, రిటైర్మెంట్ వేడుకను గౌరవప్రదంగా నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు, చిన్ననాటి స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా జరగాలి: తపస్ నేతలు



**కరీంనగర్, ఆగస్టు 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా విద్యాధికారిణిగా నియమితులైన శ్రీమతి చైతన్య జైని గారిని తపస్ జిల్లా అధ్యక్షుడు కట్ట రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు గార్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. జాబితాల తయారీ, ఖాళీల భర్తీ, సీనియారిటీ అంశాల్లో న్యాయబద్ధత పాటించాలని సూచించారు. గౌరవ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, కేంద్ర మంత్రి బండి సంజయ్ మార్గదర్శనంలో విద్యారంగ అభివృద్ధికి తపస్ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. డీఈఓ గారు కూడా విద్యార్థుల గుణాత్మక విద్య కోసం ఉపాధ్యాయ సంఘాల సహకారం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా, మండల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## పటాన్‌చెరువు నుంచి తిరుపతికి మహా పాదయాత్ర



**జడ్చర్ల, ఆగస్టు 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు నుంచి తిరుమలకు మహా పాదయాత్ర ఈ నెలలో వైభవంగా ప్రారంభమైంది. శ్రీ సీసల రాజు గురుస్వామి గారి ఆధ్వర్యంలో 21వ సంవత్సరం పాదయాత్రగా ఇది కొనసాగుతోంది. ఈ సందర్భంగా లలిత అంబికా గోశాల, జడ్చర్లలో శ్రీ సీసల రాజు, 25 మంది పాదయాత్ర బృందాన్ని ఘనంగా సన్మానించారు. పాదయాత్రలో ప్రతాప్ రెడ్డి, నగేష్, ఇసుక రాజు, మాణిక్యం, కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## బోరు సాంక్షన్ చేసిన బండి సంజయ్

- సింగారం గ్రామంలో నీటి సమస్యకు పరిష్కారం



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం గ్రామంలో నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు గౌరవ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ గారిని కోరగా, ఆయన వెంటనే స్పందించి తన ఎంపీ నిధుల ద్వారా బోరు సాంక్షన్ చేశారు. ఈ సందర్భంగా బోర్వెల్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు శ్రీ రెడ్డ బోయిన గోపి గారు హాజరై కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గ్రామస్థులు ఈ చర్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు రేపాక రామచంద్రం రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ పొన్నాల తిరుపతిరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రాగుల రాజు రెడ్డి, జిల్లా కార్యదర్శి బందారపు లక్ష్మారెడ్డి, ముస్తాబాద్ మండల అధ్యక్షులు సౌల క్రాంతి కుమార్, మండల ప్రధాన కార్యదర్శి దాసరి గణేష్, నంది నరేష్, మాజీ సర్పంచ్ మంగోలి నరసయ్య, శ్రీనివాస్ గౌడ్, వంతడుపుల సుధాకర్, తిరుపతి, బాలా గౌడ్, ఉడుగుల యాదగిరి, ప్రదీప్ రెడ్డి, కుమార్, వంగల రాజు, దయాకర్, దిలీప్, సిరిసిల్ల వంశీ చరణ్ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న శంభీపూర్ క్రిష్ణ

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బల్మూరులో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

- ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేత



**బల్మూర్, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనంగా, బల్మూర్ మండల కేంద్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తోంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ లబ్ధిదారులకు ప్రోసిడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే మా పార్టీ ధ్యేయం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించింది. పేదవారి కడుపు నింపాలన్న సంకల్పంతో దొడ్డు బియ్యాన్ని నిషేధించి, రూపాయి చొప్పున కిలో సన్న బియ్యం అందిస్తోంది," అని వివరించారు. గతంలో రేషన్ ద్వారా అందుతున్న బియ్యం తినలేక ప్రజలు మళ్లీ మిల్లర్లకు అమ్ముకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు మాత్రం నేరుగా సరఫరా చేస్తున్న సన్న బియ్యం పథకం ప్రజల ఆదరణ పొందుతోందన్నారు. "ఇది కేవలం బియ్యం పంపిణీ కాదు, పేదవారి జీవితాల్లో వెలుగు నింపే మార్గం," అని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఇందిరమ్మ రాజ్యాన్ని తిరిగి తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, పెట్టుబడి సాయం, ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం వంటి పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. "ప్రజలు ఆలోచించి, ఎల్లవేళలా ప్రభుత్వానికి విన్నతిగా ఉండాలి," అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, ఎమ్మార్వో, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు మల్ రెడ్డి వెంకట్ రెడ్డి, ఓబీసీ జిల్లా చైర్మన్ గిరివర్ధన్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాశాన్న యాదవ్, మాజీ సర్పంచ్ సుధాకర్ గౌడ్, శ్రీనివాస్, మశన్న, సంపంగి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రేషన్ కార్డు లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పరిసరాలను కాపాడుకుందాం
# భవిష్యత్ తరాలకు భద్రత కల్పిద్దాం!



పర్యావరణ పరిరక్షణ – ఈ పదానికి విలువ నిత్య జీవితంలో గణనీయంగా పెరిగిపోతోంది. మానవ జీవిత స్థితిగతులు మారుతున్నప్పటికీ, ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే మన పునాది దెబ్బతింటుందన్న అర్థం మనకు మరోసారి గుర్తుచేసే సమయంలో నిలిచాం. కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్, వన సంహారం, నీటి ఇబ్బందులు ఇవన్నీ ఒక సామాన్య పౌరుని జీవితాన్ని సైతం ప్రభావితం చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ సమితి – చెట్టు అమ్మ అనే హితబోధను నినాదంగా చేసుకున్న సాంఘిక సంస్థ, పచ్చదన పరిరక్షణకు ప్రజల్లో చైతన్యాన్ని సృష్టించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనుంది. చెట్టు నాటడం, చెట్లను సంరక్షించడం, వృక్షపూజ, విద్యార్థులకు పర్యావరణ అవగాహన, పాఠశాలలతో మైత్రి పథకాలు – ఇవన్నీ చిత్తశుద్ధితో చేపట్టే విశాల పథకంలో భాగంగా ఉండబోతున్నాయి.

### ప్రకృతిని ప్రేమించాలి – అభివృద్ధికి అదే మూలధనం

ప్రపంచం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నా, మన జీవనమూలాలు – గాలి, నీరు, నేల – ఇవి మాత్రం సున్నితంగా మారిపోతున్నాయి. మనకు సురక్షిత భవిష్యత్తు కావాలంటే, ఇవి పరిరక్షించాల్సిందే. ఒక చెట్టు 10 మందికి ప్రాణవాయువు ఇవ్వగలదన్నది శాస్త్రీయ సత్యం. అలాంటప్పుడు ఒక్కో చెట్టు నరకడం ఒక జీవితం హరిస్తున్నదే.

ఈ వాస్తవాన్ని గుర్తించి చెట్టు అమ్మ పిలుపు ఇస్తోంది – ప్రతి ఇంటిలో కనీసం ఒక చెట్టు పెంచండి అని. పర్యావరణ పరిరక్షణ సమితి కేవలం మొక్కలు నాటడమే కాదు, వాటి సంరక్షణకు సమాజాన్ని చైతన్యవంతం చేస్తోంది.

### పర్యావరణ పరిరక్షణ సమితి – భూమిని మించిన బాధ్యత

ఈ సంస్థ ప్రారంభించబోయే 'పచ్చదనం – ప్రజల దినచర్య' కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకూ ప్రతి వ్యక్తిలో ప్రకృతి ప్రేమను పెంపొందించాలనే సంకల్పంతో ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా:

- పాఠశాల విద్యార్థులకు పర్యావరణ బోధన,
- చెట్ల నాటనకు స్థానికులకు శిక్షణ,
- నీటి సంరక్షణపై అవగాహన శిబిరాలు,
- ప్లాస్టిక్ ముప్పుపై వ్యాప్తి కార్యక్రమాలు,
- రైతులతో సహజ సాగు అంశాలపై చర్చలు వంటి అనేక

బహుళ ప్రాధాన్యత కలిగిన కార్యక్రమాలు అమలుకానున్నాయి.

### వృక్ష సంరక్షణ –సంస్కారమైన బాధ్యతగా మలుద్దాం

మన సంస్కృతిలో పృథివీ మాతగా భావించబడ్డది. వృక్షాలను దేవతలుగా పూజించాం. అలాంటప్పుడు వృక్ష సంరక్షణ మన సంస్కారబద్ధమైన బాధ్యత కాదా? పర్యావరణ పరిరక్షణ సమితి ఇప్పుడు అదే స్ఫూర్తిని నేటి తరానికి అందించేందుకు ముందుకొచ్చింది. చిన్నారులలో మృదుత్వం, యువతలో చొరవ, పెద్దల్లో బాధ్యతను కలిపి – ఈ ఉద్యమాన్ని ఒక పునరుజ్జీవన కార్యక్రమంగా తీర్చిదిద్దే సన్నాహాలు జరుగుతున్నాయి. ఇది కేవలం మొక్కల ఉద్యమం కాదు – భూమిని ప్రేమించేవారి ఉద్యమం.

మనకు ఉన్నది ఒక్కటే భూమి. మన జీవితానికి మూలమైన ప్రకృతిని మనమే నాశనం చేస్తే, అది మళ్లీ మనపై విరుచుకుపడుతుంది. దీనిని అర్థం చేసుకొని పర్యావరణ పరిరక్షణ సమితి – చెట్టు అమ్మ వంటి సంస్థలు తీసుకుంటున్న బాధ్యతను ప్రతి పౌరుడు తన బాధ్యతగా స్వీకరించాలి.

**ప్రతి చెట్టు – ప్రాణదాత. ప్రతి పౌరుడు – భూమి రక్షకుడు. ప్రతి ఊరు – పచ్చదనం తోరణం.**

ఇప్పుడు మొదలెట్టండి –ఒక చెట్టు నాటండి, ఒక కుటుంబాన్ని ప్రాణాలతో నింపండి. చెట్టు అమ్మ పిలుపు స్పందించండి – పచ్చదనానికి పట్టం కడదాం!

**వ్యాసకర్త**
నరేష్ దండు
వ్యవస్థాపకులు
పర్యావరణ పరిరక్షణ సమితి చెట్టు=అమ్మ

